జిల్లాస్థాయి కోకో పోటీల్లో నెక్సస్ స్కూల్ బాలుర ప్రతిభ

ఎస్ జి ఎఫ్ అండర్-14 పోటీల్లో తృతీయ స్థానం కైవసం



నారాయణఖేడ్, నవంబర్ 02(వుదయం) : సంగారెడ్డి జిల్లాస్థాయి SGF ఎస్ జి ఎఫ్ అండర్-14 కోకో పోటీల్లో నారాయణఖేడ్‌లోని నెక్సస్ టెక్నో స్కూల్ బాలుర జట్టు సత్తా చాటింది. పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్న సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల మాట్లాడుతూ, జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు మూడో స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యతో పాటు క్రీడలకు కూడా పాఠశాలలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, అందువల్లే విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణనిచ్చి విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన్రాజు పిఇటి వంశీ, పి ఇ టి గీతలను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. వారి మార్గదర్శకత్వంలో విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. పాఠశాల బాలుర జట్టు విజయం పట్ల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రాణం పోయే ముందు.. ఆపే పథకం..!

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల ఉచిత వైద్యం - పీఎం రహత్ తో భరోసా

నాగర్ కర్నూల్ రూరల్, నవంబర్ 02 (వుదయం ప్రతినిధి) : రోడ్డుపై పడి ఉన్నాడు.. చుట్టూ జనం చూస్తున్నారు.. కానీ ఆసుపత్రికి తీసుకెళ్తే డబ్బులు ఎవరు కడతారనే భయం.. ఇలాంటి పరిస్థితుల్లో ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఈ విషాదానికి చెక్ పెట్టేందుకే కేంద్రం తెచ్చింది పీఎం రహత్ (PM-RAHAT) పథకం. రోడ్డు ప్రమాదంలో గాయపడితే చాలు.. రూ.1.5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం. జేబులోంచి ఒక్క రూపాయి తీయాల్సిన పనిలేదు. బాధితుడు బతకడమే లక్ష్యంగా ఈ పథకం అమలవుతోంది.

ఏంటీ పథకం?

2026 ఫిబ్రవరి 13న ప్రారంభమైన ఈ పథకం కింద రోడ్డు ప్రమాదం జరిగిన తేదీ నుంచి 7 రోజుల పాటు పూర్తి ఉచిత వైద్యం అందుతుంది. ఏ రహదారిపైన, ఏ మోటారు వాహన ప్రమాదమైనా వర్తిస్తుంది.

గోల్డెన్ అవర్ లోనే ప్రాణం నిలుస్తుంది..

ప్రమాదం జరిగిన మొదటి గంటే గోల్డెన్ అవర్. ఆ గంటలో వైద్యం అందితే 80 శాతం ప్రాణాలు నిలబడతాయని వైద్యుల మాట. అందుకే ఈ పథకాన్ని నేరుగా 112 అత్యవసర సేవతో లింక్ చేశారు. యాక్సిడెంట్ చూసిన వెంటనే 112కు ఫోన్ చేస్తే చాలు.. దగ్గరలోని నెట్ వర్క్ ఆసుపత్రి, అంబులెన్స్ వచ్చేస్తుంది.

గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో సాధారణ కేసులకు 24 గంటలు, ప్రాణాపాయ కేసులకు 48 గంటల పాటు ప్రాణాలు నిలబెట్టే ప్రాథమిక చికిత్స చేసి, ఆ తర్వాత 7 రోజుల వరకు పూర్తి ట్రీట్ మెంట్ ఇస్తారు. డబ్బు కట్టాల్సిన పనిలేదు..

బాధితుడి వివరాలను పోలీసులు ధ్రువీకరిస్తారు. ఆసుపత్రి వాళ్లే వివరాలను పోర్టల్ లో నమోదు చేసి ప్రభుత్వం నుంచి డబ్బులు తీసుకుంటారు. బాధితుడి కుటుంబం డబ్బు గురించి ఆలోచించాల్సిన పనిలేదు.

ఒకప్పుడు యాక్సిడెంట్ అంటేనే లక్షల బిల్లు భయం. ఇప్పుడు పీఎం రహత్ తో ఆ భయం లేదు.



యాక్సిడెంట్ చూస్తే చాలు.. వెంటనే 112కు కాల్ చేయండి.. ఒక ప్రాణాన్ని కాపాడండి.

తహసీల్దార్ ను సన్మానించిన రేషన్ డీలర్లు



అచ్చంపేట,నవంబర్ 02 (వుదయంప్రతినిధి) : నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల నూతన తహసీల్దార్ మల్లెల స్వప్నను సోమవారం రేషన్ డీలర్లు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సోమవారం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో రేషన్ డీలర్ సంఘం అధ్యక్షుడు, జిల్లా రేషన్ డీలర్ ప్రధాన కార్యదర్శి పాపిశెట్టి కుమారస్వామి, ఉల్పర వెంకటయ్య, శంకర్ ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీల తీరుపై సర్పంచుల ఆగ్రహం



బిజినపల్లి, నవంబర్ 2 (వుదయం ప్రతినిధి) : ఇందిరమ్మ ఇండ్ల కమిటీకి చైర్మన్లుగా ఉన్న సర్పంచులను ఆ కమిటీ సభ్యులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సోమవారం ఆయా గ్రామాల సర్పంచులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కమిటీలకు చైర్మన్లుగా ఉన్న తమకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, తమ ప్రమేయం లేకుండానే కమిటీ సభ్యులతో కలిసి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరికి ఇళ్లు వచ్చింది, ఎవరికి రాలేదు అనే కనీస సమాచారం కూడా తమకు లేదని, దీని వల్ల ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో సర్పంచులను కూడా భాగస్వాములను చేయాలని, తమకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రజావాణి ఫిర్యాదులో సర్పంచులు బోనాసి రామకృష్ణ, బి. నరసింహ రెడ్డి, ఎన్. నాగిరెడ్డి, డి. ప్రణీత, అంజయ్య, శంకర్ తదితరులు ఉన్నారు.

పాలెం వెంకటేశ్వర స్వామి ఆలయ భూములకు డిజిటల్ సర్వే



బిజినపల్లి, నవంబర్ 2 (వుదయం ప్రతినిధి) : బిజినపల్లి మండలం పాలెం గ్రామంలోని శ్రీ అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన భూములకు సోమవారం మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో డిజిటల్ సర్వే నిర్వహించారు.

సర్వే ద్వారా దేవస్థాన భూములను గుర్తించి వాటి హద్దులను నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవిందు రామకృష్ణ, కొంకలి యాదగిరి, కుర్మయ్య, నాగయ్య, దశరథం, శంకర్, బీరయ్య, రాము తదితరులు పాల్గొన్నారు


చెల్లెపాడు లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద కాపర్ వైర్ల చోరీ.. నిందితుల అరెస్ట్

రైతుల అప్రమత్తతతో దొంగల ఆటకట్టు.. కాపర్ వైర్లు స్వాధీనం

చోరికి పాల్పడిన వారు జటప్రోలు గ్రామస్తులుగా గుర్తింపు







చిన్నంబావి మండలం 02 వుదయం రిపోర్టర్ : చిన్నంబావి మండలంలోని చెల్లెపాడు ఎత్తిపోతల పథకం వద్ద కాపర్ వైర్ల చోరీకి పాల్పడుతున్న నిందితులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రైతుల అప్రమత్తతతో చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. చెల్లెపాడు గ్రామానికి చెందిన రైతులు రాత్రి సమయంలో పంట పొలాలకు నీళ్లు కడుతున్నారు క్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ సమీపంలో ఇనుప వస్తువుల శబ్దం వినిపించడంతో అనుమానం వచ్చి అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ క్రమంలో కాపర్ వైర్లు చోరీ చేస్తున్న దుండగులను గుర్తించారు. ఒక నిందితుడు బైక్‌పై పరారవగా, మరొకరు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామస్తులు స్థానిక ఎస్సై రామన్ గౌడ్ కు సమాచారం అందించారు, తక్షణమే స్పందించిన ఎస్ఐ సంఘటన స్థలానికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఇటుగా వస్తున్న బైకులను ఆపి పరిశీలించగా నిందితులు వెల్టూరు, చిన్నమారుర్ రహదారి సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు జటప్రోల్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. చోరీకి గురైన కాపర్ వైర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మూడు నెలల క్రితం చిన్నమారు ఎత్తిపోతల పథకం ఫేజ్-2 వద్ద కూడా కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఘటన మరువక ముందే తాజాగా మరో చోరీ వెలుగులోకి రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎత్తిపోతల పథకాల వద్ద నిఘా పెంచాలని రైతులు పోలీసులను కోరుతున్నారు. ఈ ఘటనపై అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాఫువా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామన్ గౌడ్ తెలిపారు. చోరీలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగినులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు



షీ టీం ఇన్ చార్జ్ ఎస్ఐ ఇందిర హెచ్చరిక

అచ్చంపేట, నవంబర్ 02 (వుదయం ప్రతినిధి) : మహిళా ఉద్యోగినులు విధులు నిర్వహించే చోట వేధింపులకు గురి చేస్తే అలాంటి వారిపై పోసో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని షీ టీం జిల్లా ఇన్ చార్జ్ ఎస్ఐ ఇందిర హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఆదేశాల మేరకు పట్టణంలోని సాయి నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాళ్లతో సమావేశం నిర్వహించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వహించే చోట తోటి ఉపాధ్యాయులు వేధింపులకు గురి చేస్తే షీ టీం కు సమాచారం ఇవ్వాలని, అలాంటి వారిని గుర్తించి చట్ట ప్రకారం పోసో చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్భయంగా విధులు నిర్వహించుకోవాలని, ఎలాంటి వేధింపులకు గురైనా ధైర్యంగా ముందుకు వచ్చి సమాచారం అందించాలని సూచించారు. గతంలో ఇదే పాఠశాలలో ఇటువంటి సంఘటన జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల మహిళా ఉద్యోగులు, షీ టీం సభ్యులు, అచ్చంపేట డివిజన్ ఇన్ చార్జ్ హెడ్ కానిస్టేబుల్ పద్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం.. పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్



నంగునూరు : నవంబర్ 2 (వుదయం) : ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF)ద్వారా మంజూరైన చెక్కును నంగునూరు మండలాని కి చెందిన లబ్ధిదారుకు ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ పంపిణీ చేశారు. నంగునూరు గ్రామానికి చెందిన కొండిల స్రవంతి భర్త వెంకటేష్‌కు మంజూరైన ఏఎంసీ చెక్కును ఆయన అందజేశారు. మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ సహకారంతో ఈ సాయం మంజూరైనట్లు సాదుల పవన్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద, నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్స్ ఎండీ ఇమ్రాన్,జీవన్ నాయక్, పిడిచెట్టు ప్రభాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ కరెర్ల వెంకట్ రెడ్డి, గడ్డం కరుణాకర్ రెడ్డి, శ్యామ్ రెడ్డి, లింగంపల్లి అజయ్, చిర్రం భాను, ప్రశాంత్, శంకరయ్యతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొష్టికాహారంతోనే బాలల వికాసం

శేర్ ఖాన్ పల్లి పాఠశాలలో అల్పాహార కార్యక్రమం ప్రారంభం

గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభం



హత్నూర నవంబర్ 2: (వుదయం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న అల్పాహార కార్యక్రమాన్ని శేర్ ఖాన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రామ సర్పంచ్ మన్నె లక్ష్మి శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎం. హుస్సేన్ బాబా చేతుల మీదుగా ప్రారంభించారు. అల్పాహారంలో పూరీని అందించగా, రాబోయే రోజుల్లో దోశ, మిల్లెట్ ఇడ్లీ, బోండా, ఉప్మా వంటి వివిధ రకాల అల్పాహార పదార్థాలను మెనూ ప్రకారం అందించనున్నారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మన్నె లక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం వల్ల వారి శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసం, చదువుపై ఏకాగ్రత కూడా పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు.

ఉపసర్పంచ్ ఎండి. హుస్సేన్ బాబా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యలో రాణిస్తూ భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

పాఠశాలలో అల్పాహారము అందించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయం పిల్లల ఆరోగ్యానికి, విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామ కార్యదర్శి అజీముద్దీన్ ప. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు చందూరి సంతోష్ రాజ్, ఉపాధ్యాయురాలు శ్రీమతి రజిత, గ్రామ కార్యదర్శి అజీముద్దీన్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేరు గ్రామాలలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు....

ప్రారంభించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.....



వుదయం న్యూస్ శివ్వంపేట నవంబర్ 02....


మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.

మండల పరిధిలోని చెన్నాపూర్. చిన్నగొట్టిముక్ల. పిల్లుట్ల. గుండ్లపల్లి. ఎదుల్లాపూర్ గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను నరసాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. కరువు మండలాలుగా ప్రకటిస్తే సబ్సిడీపై ఎరువులు విత్తనాలు వస్తాయని పశు గ్రాసం వస్తుందని నేటికి నిధులు వస్తాయని ఉపాధి పనుల్లో అదనంగా పనులు దొరుకుతాయని గుర్తు చేశారు. కరువు మండలం ప్రకటించకపోతే వీటన్నిటినీ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని తెలిపారు. వర్షాలు సరిగ్గా కురవక రైతులు పంట నష్టపోయారని ఎకరానికి 30000 నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుండి ఏజెంట్ సంస్థలు రైతుల నుండి క్వింటాల్కు 3300 వరకు చెల్లించి ధాన్యాన్ని సేకరిస్తున్నారని వేరే రాష్ట్రాలకు ధాన్యం తరలిపోతే భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలకు బియ్యం దొరకడం కష్టమవుతుందని అన్నారు. కావున ప్రభుత్వమే రైతులకు క్వింటాలకు 3300 రూపాయలు చెల్లించి ధాన్యం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కమలాద్రి. మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్. జిల్లా మాజీ ఎంపీపీల ఫోరం అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ. మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్. కోఆప్షన్ సభ్యులు మన్సూర్.ఆయా గ్రామాల సర్పంచులు కుమార్. నారాయణరావు. రాజు. నర్సింగరావు. రాజేందర్ నాయక్. చెన్నాపూర్ ఉప సర్పంచ్. శ్రావణి ప్రవీణ్ గౌడ్. సంజీవ్ కుమార్ మహేందర్ రెడ్డి. నరేందర్. పాపయ్య చారి. నాగేశ్వరరావు. జగన్. మైసయ్య యాదవ్. ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతు ఆవేదన

రోడ్డు నిర్మాణంతో ఎకరం భూమి కోల్పోతున్నానని రైతు ఆవేదన





వెల్దండ నవంబర్ 2, (వు దయం) : నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల పరిధిలోని కొత్ర గేట్ సమీపంలో హైదరాబాద్--తిరుపతి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా తమ భూమిని కోల్పోతున్నామని వెల్దండ మండలం కోత్ర శివారులోని రైతు శేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 509లో తనకు చెందిన ఎకరం వ్యవసాయ భూమి రోడ్డు నిర్మాణంలో పోతుండటంతో సుమారు రూ.5 కోట్ల విలువైన ఆస్తిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుమారు మూడేళ్ల క్రితం రోడ్డు నిర్మాణానికి సంబంధించి అధికారులు చేపట్టిన మార్కింగ్ లో హైదరాబాదు నుండి 76 కిలోమీటర్ల 400 మీటర్ల నుండి వేయవలసిన రోడ్డు నిర్మాణం ప్రకారం మార్కింగ్ సర్వే ఉంటే దానికి గాను 76 కిలోమీటర్లు రా నుండి తీసుకోవడం వల్ల ప్రస్తుతం తన పొలం మీదుగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అప్పట్లో హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు పొందినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం కోర్టు స్టే రద్దయిందని నేషనల్ హైవే అధికారులు చెబుతున్నారని, అందుకు సంబంధించిన కోర్టు ఉత్తర్వుల ప్రతిని చూపించిన తర్వాతే పనులు చేపట్టాలని కోరారు. గతంలో రూపొందించిన సర్వే, రోడ్డు నిర్మాణ ప్రణాళికను పరిగణనలోకి తీసుకోకుండా తన భూమి మీదుగా రోడ్డు వేయడం వల్ల తమ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై స్పందించి, తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతు శేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రైతన్నలకు దిశానిర్దేశం చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువలాభాలు పొందండి

- పత్తి తీసేటప్పుడు ఈ జాగ్రత్తలు పాటిస్తేనే మంచి ధర!
- కొంకపాకలో ఆకట్టుకున్న రైతు సదస్సు!
- నేలతల్లి ఆరోగ్యం, నాణ్యమైన పత్తియే లక్ష్యంగా
- ప్రజాధ్వని సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు!
- ప్రజ్వల్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఇన్నారెడ్డి



పర్వతగిరి , నవంబర్ 02 (వుదయం ప్రతినిధి): పర్వతగిరి మండలం కొంకపాక గ్రామంలో తక్కల్లపల్లి మధుసూదన్ రావు గారి పత్తి పొలంలో శుక్రవారం రైతులతో ప్రత్యేక క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం చాలా ఘనంగా నిర్వహించారు. ప్రజ్వల్ సంస్థ పర్వతగిరి మండల సమన్వయకర్త గటిక మృదుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఇన్నారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.

నూతన సాగు విధానాలపై అవగాహన:

ఈ సమావేశంలో ప్రాజెక్ట్ మేనేజర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పత్తి సాగులో పాత పద్ధతులు మాని సరికొత్త వ్యవసాయ సాగు పద్ధతులు పాటించాలని కోరారు. ముఖ్యంగా తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచే పద్ధతిని పాటించడం, మొక్కల పెరుగుదలను అదుపులో ఉంచడం, తగినపాళ్లలో ఎరువులను వాడుకోవడం ద్వారా ఆశించినదానికంటే ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

నేల ఆరోగ్యం – సేంద్రియ ఎరువుల వాడకం:

భూమి సారాన్ని కాపాడుకోవడానికి రైతులు తప్పకుండా ప్రకృతి సిద్ధమైన వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. సంస్థ ద్వారా అందిస్తున్న చెత్త కంపోస్ట్, వానపాముల ఎరువు (వర్మి కంపోస్ట్), వానపాముల కషాయం, జీవామృతం, వ్యర్థ విచ్ఛిన్నకారులను వినియోగించి భూసారాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

నాణ్యమైన పత్తి దిగుబడి – మంచి ధర:

పత్తిలో నాణ్యత పెరగాలంటే కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కాయలు పూర్తిగా పగిలిన తర్వాత, తేమ లేని సమయాలలో, చెట్టు కింద నుండి పైకి చెత్తాచెదారం పడకుండా పత్తిని సేకరించాలని సూచించారు. కూలీలు తలకు గుడ్డ కట్టుకొని, శుభ్రమైన బట్టలు వేసుకొని పత్తి తీయాలని, గాలి వెలుతురు ఉన్న ప్రదేశంలో నిల్వ చేసి రకం వేరు చేసిన తర్వాతే మార్కెట్‌కు తీసుకువెళ్తే మంచి ధర లభిస్తుందని తెలిపారు.

శ్రామిక సంక్షేమం మరియు సమానత్వం:

ఈ కార్యక్రమంలో భాగంగా కూలీల సంక్షేమంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. పనిచేసే చోట కూలీలకు ఎలాంటి వివక్ష, హింస, వేధింపులు, బలవంతపు పనులు వంటివి ఎదురైతే గ్రామ పరిధిలోని లింగ సమానత్వ కమిటీ సభ్యులకు సమాచారం అందించాలని, వెంటనే తగిన పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. అలాగే, పనిచేసే స్థలంలో కూలీలకు తాగునీరు, నీడ, విశ్రాంతి, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి బద్రు నాయక్ తో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కాకతీయుల కాలం నాటి రోళ్లకల్ శంభుని శివాలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అడుగులు!

- ఎండోమెంట్ శాఖలో ఆలయ రిజిస్ట్రేషన్ పూర్తి..
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతా ప్రారంభం.
- ఆలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.
- ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్పంచులు దేవి మంగ్యా నాయక్, జాంప నాయక్, డెక్క సునీతా కుమారస్వామి



పర్వతగిరి ,నవంబర్ 02 (వుదయం ప్రతినిధి): పర్వతగిరి మండలం రోళ్లకల్ గ్రామంలో కాకతీయుల కాలం నాటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పురాతన శంభుని శివాలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కీలక అడుగులు పడుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వరుసగా ముందడుగులు పడుతున్నాయి.

ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ శాఖలో శంభుని శివాలయ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఆలయ నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా కొనసాగించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతాను ప్రారంభించారు..

టీటీడీ అధికారుల పరిశీలన. నిధుల కోసం చర్యలు:

ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించే విషయమై తిరుమల తిరుపతి దేవస్థానం (ుణ) అధికారులు ఆలయాన్ని సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్థిక సహాయం ప్రక్రియలో భాగంగా గ్రామ పంచాయతీ, MRO కార్యాలయాలకు సంబంధించిన అవసరమైన రికార్డులను కోరారు. దీనిపై స్పందించిన రోళ్లకల్ గ్రామ సర్పంచ్ దేవి మంగ్యా నాయక్ వారం రోజుల్లోగా అవసరమైన పత్రాలను అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటన:

రోళ్లకల్ శంభుని శివాలయ పునర్నిర్మాణానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు తన వంతుగా రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందించిన ఎమ్మెల్యే గారికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్పంచులు:

ఆలయ ఎండోమెంట్ రిజిస్ట్రేషన్ పూర్తవడం, కమిటీ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతా ప్రారంభం సందర్భంగా రోళ్లకల్ గ్రామ సర్పంచ్ దేవి మంగ్యా నాయక్, నారాయణపురం గ్రామ సర్పంచ్ జాంప నాయక్, వడ్లకొండ సర్పంచ్ డెక్కే సునీత కుమారస్వామి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఈ సందర్భంగా కాకతీయుల కాలం నాటి చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వ సంపదగా నిలిచిన ఈ పురాతన శివాలయాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామ ప్రజలు, భక్తులు ఐకమత్యంతో ముందుకు వచ్చి సహకరించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల ఉపసర్పంచులు, మాజీ సర్పంచ్ భీలు నాయక్, సమ్మయ్య ముదిరాజ్, సర్పంచ్ పురుషోత్తం, వడ్లకొండ మాజీ సర్పంచ్ ఆమడగాని రాజు యాదవ్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మన చరిత్రకు ప్రతీక.. మన ఆధ్యాత్మిక వారసత్వానికి నిలయం.. రోళ్లకల్ శంభుని శివాలయం!

కాకతీయుల కాలం నాటి చారిత్రక సంపదను భావితరాలకు అందించాలనే సంకల్పంతో గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హర హర మహాదేవ!

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ



భూపాలపల్లి నవంబర్ 2 వుదయం ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల గ్రామానికి చెందిన సంపంగి బక్కయ్య పాము కాటుతో మరణించగా 9వ రోజు వారి గృహానికి చేరుకొని బక్కయ్య చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు తదనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యాన్ని కల్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల కోశాధికారి మచ్చ పైడి మాదిగ, ఎంఎస్పి మండల కార్యదర్శి మచ్చ రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఏరివెల్లి రాజేష్ మాదిగ,కొల్గురి సదానందం, కోండ్ర ప్రశాంత్ మాదిగ కోండ్ర రాజేందర్ మాదిగ, మచ్చ రాకేష్ మాదిగ, సంపంగి పెద్ద సమ్మయ్య, రాయమల్లు, చిన్న సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి, నవంబర్ 02 (వుదయం విలేకరి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం, కొరికిశాల గ్రామ మాజీ సర్పంచ్ రాములు కుమారుడు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాస్పిటల్‌కు చేరుకుని ప్రమాద సంఘటన వివరాలు తెలుసుకుని, రాములు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు

ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా పోలీస్ సేవలను వినియోగించుకోవాలి

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



భూపాలపల్లి: నవంబర్ 02(వుదయం విలేకరి) : ప్రజలు ఎలాంటి పైరవీరులు లేకుండా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 13 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

అధికారుల పర్యవేక్షణ కరువు.. సర్పంచ్ ఇష్టారాజ్యం!

- 4 లక్షల ప్రజాధనం గాలికి - జమాల్‌పురంలో నాసిరకంగా బతుకమ్మ సర్కిల్ సీసీ పనులు...
- మండిపడుతున్న గ్రామస్తులు!



పర్వతగిరి , నవంబర్ 02 (వుదయం ప్రతినిధి): వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం జమాల్‌పురం గ్రామంలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ అభివృద్ధి కోసం సుమారు నాలుగు లక్షలకు పైగా రూపాయలు మంజూరయ్యాయి.

ఈ నిధులతో గ్రామ సర్పంచ్ జూన్న కనకయ్య ఆధ్వర్యంలో చిన్న చెరువు వద్ద ఉన్న బతుకమ్మ సర్కిల్ ప్రాంతంలో సీసీ గ్రౌండ్ (కాంక్రీట్ రోడ్డు) పనులు చేపట్టారు. అయితే, ఈ పనులు పూర్తి నాసిరకంగా, ఎలాంటి అధికారిక పర్యవేక్షణ లేకుండా జరిగాయని గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

ప్రశ్నార్థకంగా మారిన నాణ్యత: నిబంధనల ప్రకారం వేయాల్సిన మందానికి తిలోదకాలిచ్చి, కేవలం 3 నుండి 4 ఇంచుల మందంతోనే ఇష్టానుసారంగా రోడ్డు వేశారు. ఫలితంగా, పనులు పూర్తయిన కొద్దిరోజులకే సీసీ గ్రౌండ్ మొత్తం పగుళ్లు వచ్చి, నెర్రెలు బారింది. కేవలం మొక్కుబడిగా రెండు ట్రిప్పుల మొరం పోసి, సైడ్ బార్మ్‌లతో పనులను మమ అనిపించేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజాధనాన్ని కాపాడాలని విజ్ఞప్తి: ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను ఇలాంటి నాసిరకం పనుల ద్వారా కొల్లగొడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరియు విజిలెన్స్ శాఖ స్పందించి, తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, గ్రామ అభివృద్ధిని కాపాడాలని జిల్లా కనకయ్య , జంగిలి భాస్కర్ తో పాటు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రజలు సందర్శించాలి

చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులను ప్రోత్సహించాలి. కలెక్టర్ డాక్టర్ సత్య శారద.



వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 2 : చేనేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రజలు సందర్శించి, వస్త్రాలను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్, తెలంగాణ రాష్ట్ర చేనేత, జౌళి శాఖ, చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎన్‌జీఓస్ కాలనీ రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన చేనేత వస్త్ర ప్రదర్శనను కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. నవంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు మొత్తం 14 రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

పర్వతగిరి మార్కెట్ యార్డులో ప్రభుత్వ సొమ్ము లూటీ!

- ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 30 లక్షల విలువైన షెడ్లు,ఐరన్ పోల్స్ మాయం చేసే ఆలోచన
- ఏనమాముల మార్కెట్ సెక్రటరీ, అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- అసలు దోంగలు ఎవరు...?
- స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ తక్షణమే చర్యలు తీసుకోవాలి: భోనగిరి దుర్గేష్



పర్వతగిరి , నవంబర్ 02 (వుదయం ప్రతినిధి): పర్వతగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అక్రమార్కులు యథేచ్ఛగా ప్రభుత్వ ఆస్తులను లూటీ చేస్తున్నారు. రైతులకు, ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా నిర్మించిన మార్కెట్ గోదాముల రేకుల షెడ్లను, ఐరన్ స్తంభాలను ఎలాంటి ప్రభుత్వ పర్మిషన్లు లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా స్థానిక నాయకులు కొందరు పట్టపగలే తీసి అమ్ముకునేందుకు ప్రయత్నిస్తుండటం తీవ్ర కలకలం రేపుతోంది.

సుమారు రూ. 30 లక్షల విలువైన ప్రభుత్వ ఆస్తులను పగటిపూటే దోచుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానిక సామాజిక కార్యకర్త, యువ నాయకులు భోనగిరి దుర్గేష్ మండిపడ్డారు. ఈ వ్యవహారంపై స్థానికులు పోలీస్ స్టేషన్‌ను , జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.ఈ అక్రమ తరలింపుపై ఏనమాముల మార్కెట్ సెక్రెటరీని వివరణ కోరగా..."తనకు ఈ విషయమై ఎలాంటి సమాచారం లేదు,షెడ్లు తొలగించేందుకు సంబంధించి మార్కెట్ కమిటీ నుంచి ఎలాంటి ఆర్డర్లు అందలేదు" అని చెప్పడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మార్కెట్ అధికారులకు తెలియకుండా అంత భారీ ఎత్తున రేకుల షెడ్లను ఎలా తొలగిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఈ సందర్భంగా స్థానిక నాయకులు భోనగిరి దుర్గేష్ మాట్లాడుతూ..."రైతుల సంక్షేమం కోసం,ప్రజా ప్రయోజనాల కోసం రైతులు అకాల వర్షాలకు వడ్లు, మక్కలు, ఇతర ధాన్యాలు తడవకుండా ఆరవేసుకోవడానికి నిర్మించిన మార్కెట్ గోదాములను కొందరు స్వార్థ నాయకులు తమ సొంత లాభం కోసం దొంగతనంగా అమ్ముకోవాలని చూస్తున్నారని ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఈ ఇంటి దొంగలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యులు కేఆర్ నాగరాజు గారు, ఏనమాముల మార్కెట్ కమిటీ చైర్మన్ గారు తక్షణమే ఈ వ్యవహారంపై స్పందించి, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని, మార్కెట్ యార్డు ఆస్తులను రక్షించాలి" అని డిమాండ్ చేశారు.



మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం



చెన్నారావుపేట నవంబర్ 2 (వుదయం ప్రతినిధి) : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్, నవంబర్ 2 నా స్థానిక మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీమతి చిట్ట జ్యోతి గారి అధ్యక్షతన 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 10వ తరగతి క్లాస్ టీచర్లు నల్లతీగల యాకయ్య మరియు మాటూరి సూరిబాబు గార్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై పలు కీలక అంశాలను చర్చించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీమతి చిట్ట జ్యోతి మాట్లాడుతూ.. "విద్యార్థుల భవిష్యత్తుకు 10వ తరగతి అత్యంత కీలకం. ఇటీవలే పూర్తయిన ఎస్ ఏ -1 (సమ్మేటివ్ అసెస్‌మెంట్-1) పరీక్షల మార్కులను విశ్లేషించి, ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేయడం జరిగింది. రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని నవంబర్ 2వ తేదీ నుండి ప్రతిరోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట చొప్పున ప్రత్యేక తరగతులు (ప్రత్యేక తరగతులు) నిర్వహిస్తున్నాము. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా హాజరయ్యేలా చూస్తూ, పాఠశాలకు పూర్తి సహకారం అందించాలి అని కోరారు.

అంతేకాకుండా ఆమె మరింత స్పష్టం చేస్తూ. విద్యార్థుల క్రమశిక్షణ, ఇంటి వద్ద వారు చదివే వాతావరణంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి. పిల్లల దృష్టి మరలకుండా సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచడం చాలా అవసరం. మన ఉపాధ్యాయులు ఎంతో అంకితభావంతో అదనపు సమయం కేటాయించి బోధిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు, అత్యధిక శాతం విద్యార్థులు 10/10 జీపీఏ(మంచి మార్కులు) సాధించి మన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.

10వ తరగతి ఆర్యభట్ట సెక్షన్ క్లాస్ టీచర్ శ్రీ నల్లతీగల యాకయ్య మాట్లాడుతూ.. "చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాము. వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధనా పద్ధతులు అమలు చేస్తూ, ప్రతిరోజూ వారి పురోగతిని పర్యవేక్షిస్తాము. ఉపాధ్యాయులు పాఠశాలలో ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో విద్యార్థులు ఇంటి వద్ద కూడా క్రమం తప్పకుండా చదివేలా తల్లిదండ్రులు అంతే బాధ్యతగా పర్యవేక్షించాలి" అని సూచించారు.

10వ తరగతి భాస్కరాచార్య సెక్షన్ క్లాస్ టీచర్ మాటూరి సూరిబాబు మాట్లాడుతూ.. "ఎస్ ఏ -1 మార్కుల ఆధారంగా ప్రతి విద్యార్థికి ఎక్కడ మెరుగుపడాలో సూచనలు ఇస్తున్నాము. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మన పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా ఒక బృందంగా పని చేయాలి" అని అన్నారు.

అనంతరం జరిగిన ఇంటరాక్షన్ సెషన్‌లో తల్లిదండ్రుల అభిప్రాయాలను పంచుకున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు ముత్తోజు నాగేంద్ర చారి మాట్లాడుతూ.. "పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్న ఉపాధ్యాయుల నిర్ణయం ఎంతో హర్షణీయం. మీ ఈ కృషికీ, సమయపాలనకూ తల్లిదండ్రుల తరఫున మా వంతు పూర్తి సహకారం అందిస్తాము" అని తెలిపారు.

మరో పేరెంట్ శ్రీమతి కారు రాజమణి మాట్లాడుతూ. పిల్లల చదువు పట్ల ఉపాధ్యాయులు తీసుకుంటున్న శ్రద్ధ, ప్రతి విద్యార్థికి సబంధించిన ఎస్ ఏ-1 మార్కుల లోతైన విశ్లేషణ మాకు ఎంతో సంతృప్తినిచ్చింది. ముఖ్యంగా వెనుకబడిన పిల్లల కోసం మీరు తీసుకుంటున్న ఈ ప్రత్యేక చర్యలు వారిలో తప్పక మార్పును తీసుకువస్తాయి అని సంతోషం వ్యక్తం చేశారు.

వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అండె సుశీల గారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నర్సంపేట ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



చెన్నారావుపేట నవంబర్ 2 (వుదయం ప్రతినిధి) : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అండె వెంకట్రాములు గారి తల్లి అండె సుశీల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉప్పరపల్లికి చేరుకొని అండె సుశీల గారి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు

అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు

వారి వెంట. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బాల్నే వెంకన్న.మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్.దుగ్గొండి మాజీ వైఎస్ ఎంపిపి జైపాల్ రెడ్డి, స్థానిక గ్రామ సర్పంచ్ చిలపాక అనిత మొగిలి.గ్రామ ఉపసర్పంచ్ మంతుర్తి అన్వేష్. మాజీ కోఆప్షన్ మెంబర్ రఫీ.మాజీ సర్పంచ్ కుండే మల్లయ్య.మాజీ ఎంపీటీసీ చెరుకుపల్లి విజేందర్. మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్.గ్రామ పార్టీ అధ్యక్షులు కందగట్ల సాంబయ్య. వార్డు సభ్యులు కొల్లూరి మల్లయ్య.వట్టే మధుకర్.కాసాని కుమారస్వామి.ఉడుగుల సాంబయ్య.కొండ్రెడ్డిమహేందర్ రెడ్డి. పవన్.గ్రామ నాయకులు పార్టీ నాయకులు.కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు